క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలసిన పద్మలత



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పద్మలత, పక్కన ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ: బీసీ సంక్షేమ సంఘ జాతీయ మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు డాక్టర్ అనసూరి పద్మలత శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ పాలన నాలుగు వసంతాలు పూర్తి చేసుకుని ఐదో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఎంపీ భరత్‌రామ్, బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

సీటీఆర్‌ఐ: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను జూన్ 15 నాటికి నూరు శాతం పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఇంజినీరింగ్ సిబ్బందితో కలసి పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ఎక్కడా ముంపు సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్‌ఈ పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు

ప్రకాశంనగర్: పౌరహక్కుల రక్షణ చట్టం, అత్యాచారాల నిరోధక చట్టం ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరిగేందుకు జాతీయ హెల్ప్‌లైన్ ఎగినెస్ట్ అట్రాసిటీస్ ఆవిష్కరణ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి శనివారం ఎం.సందీప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో 30న సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రకృతి సాగు చేస్తున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన పేద రైతులకు విత్తనాలు, పరికరాలను వంద శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. శనివారం ఎస్సీ పేద రైతులకు విత్తనాలు, పరికరాలు ఏపీ సీడ్స్ అండ్ ఏపీ ఆగ్రోస్ వారి సహకారంతో అందించేందుకు గాను విధి విధానాలు నిర్దేశించడానికి జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏపీ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చినరాముడు ఆదేశాల మేరకు జిల్లాలో త్వరలో మెగా మేళా నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను తేజ్‌భరత్ ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, రైతు సాధికార సంస్థ డీపీఎం బి.తాతారావు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జె.కృష్ణయ్య, ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ కె.సత్యవతి, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ కె.నందేశ్ పాల్గొన్నారు.

మూగ బాలుడిని గుర్తించిన రైల్వే పోలీసులు



రైల్వే పోలీసులకు దొరికిన మూగ బాలుడు

కంబాలచెరువు: ఊరు పేరు తెలియని సుమారు ఎనిమిదేళ్ల మూగ బాలుడిని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు శనివారం గుర్తించారు. బొకారో ట్రైన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని కొంతమంది ప్రయాణికులు గుర్తించి రాజమండ్రి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. వారు మూగ బాలుడిని వివరాలు అడిగినా తెలపలేక పోవడంతో చైల్డ్ కేర్‌కు అప్పగించారు. బాలుడిని ఎవరైనా గుర్తిస్తే 94406 27551 నెంబరుకు సమాచారమివ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

శిక్షణ భళా.. పతకం సాధించేలా..

- వాలీబాల్‌లో క్రీడాకారులకు తర్ఫీదు
- జాతీయ స్థాయి పోటీలకు పయనం



సబ్ జూనియర్ వాలీబాల్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ పొందిన క్రీడాకారులు

ప్రకాశంనగర్: లక్ష్యానికి సాధన తోడైతే.. విజయం కోసం అహర్నిశలూ శ్రమిస్తే.. అనుకున్న గోల్ సాధించొచ్చు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణం వేదికగా వాలీబాల్‌లో శిక్షణ పొందిన నలుగురు జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ తమదైన శైలిలో దూసుకుపోయేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలోని పరిమి రామచంద్రరావు మోమోరియల్ ఫ్లైరిలైట్ వాలీబాల్ కోర్టులో కఠోర శిక్షణ తీసుకుని క్రీడా సమరానికి సై అంటున్నారు. 28న వెస్ట్ బెంగాల్ హుగ్లీలో జరగబోయే 45వ సబ్ జూనియర్ వాలీబాల్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్రంలోని మొత్తం 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందులో జిల్లా నుంచి రాష్ట్ర బాలుర జట్టుకు తునికి చెందిన వరుణ్ సందేశ్, రాంబాబు, మండపేటకు చెందిన ప్రేమ్‌కుమార్, బాలికల జట్టులో అమలాపురానికి చెందిన సంధ్యన ఉన్నారు. వీరంతా అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలో ఆడేందుకు రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది క్రీడాకారుల జట్టుకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 19 నుంచి 25 వరకూ శిక్షణ ఇచ్చారు. నగరానికి చెందిన వై.బాల వెంకటేశ్వరరావు కోచ్‌గా వ్యవహరించారు. ఆదివారం వెస్ట్ బెంగాల్‌లోని హుగ్లీలో జరిగే సబ్ జూనియర్ వాలీబాల్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు నగరం నుంచి వీరంతా శనివారం బయలుదేరి వెళ్లారు.

పలువురి అభినందన

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్‌వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సురేష్ ప్రభు తదితరులు అభినందించారు. ఎంపీ భరత్‌రామ్ క్రీడాకారులకు అవసరమైన కిట్లు, జెర్సీలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను మరింత మెరికల్లా తయారు చేసేందుకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం క్రీడాకారులకు శిక్షణతో పాటు అవసరమైన పౌష్టికాహారం, వసతిని ప్రభుత్వమే కల్పిస్తుంది. దీంతో పాటు జగనన్న క్రీడా సంబరాల పేరిట పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులకు నగదు పురస్కారాలను అందజేస్తుంది.

మంచి శిక్షణతో విజయాలు



వాలీబాల్ క్రీడలో రాణించేందుకు క్రమం తప్పకుండా శిక్షణ అవసరం. అప్పుడే క్రీడలో మంచి నైపుణ్యం సాధించవచ్చు. గతంతో పోలిస్తే ఇప్పుడు యువత క్రీడలపై ఆసక్తి చూపుతోంది. ముఖ్యంగా బాలురతో పాటు బాలికలు అన్ని క్రీడల్లో రాణిస్తున్నారు. క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హర్షణీయం.

-కె.యశ్వంత్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. తాడితోటలోని అంబేడ్కర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఆమె శుక్రవారం ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు చేరువలో ఉండేలా అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిత్యం ఎన్ని ఓపీలు చూస్తారని అక్కడున్న వైద్య సిబ్బందిని అడిగారు. 40 నుంచి 50 మంది వరకు చూస్తామని వారు బదులిచ్చారు. ప్రతి శనివారం చిన్న పిల్లలకు ఇమ్యునైజేషన్ టీకాలు ఇస్తున్నామన్నారు. ఈ శనివారం 35 మంది చిన్నారులకు టీకాలు ఇచ్చామన్నారు. ఆసుపత్రిలో లేబర్ రూంపై ఆరా తీశారు. యూహెచ్‌సీల పరిధిలో లేబర్ రూములు ఉండవని సిబ్బంది తెలిపారు. రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదు వివరాలు పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యతలేని కోడిగుడ్లు

- కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల వెల్లడి



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని, బరువు తక్కువ ఉన్న కోడిగుడ్లు సరఫరా చేస్తున్నట్లు తమ తనిఖీల్లో గుర్తించామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి.సీతారాం, ఆదిలక్ష్మి, త్రిపర్ణ వెల్లడించారు. ఆ కోడిగుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. శనివారం స్థానిక ఇన్నీసుపేటలోని 3, 4వ అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. కోడిగుడ్లు, పాలు, బాలామృతం ఎలా పంపిణీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. మూడు నెలలుగా తక్కువ బరువున్న నాణ్యత లేని కోడిగుడ్లు సరఫరా చేస్తున్న విషయాన్ని లబ్ధిదారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా కోడిగుడ్లు సరఫరా చేస్తున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూకు అనుగుణంగా కోడిగుడ్లు సరఫరా చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా జిల్లా అధికారులకు సూచనలు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని, బరువు తక్కువ ఉన్న కోడిగుడ్లు ఎక్కువ సంఖ్యలో పంపిణీ చేస్తున్నట్లు గుర్తించామని ఆదిలక్ష్మి చెప్పారు. దీనివల్ల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందనట్లు తాము భావించి కాంట్రాక్ట్ రద్దుకు తాము సిఫారసు చేయనున్నామని అన్నారు. రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసే గుత్తేదార్లు నాణ్యతతో కూడినవి అందించాల్సిందేనన్నారు. లేకుంటే చర్యలకు వెనకాడేదే లేదన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి, బి.రమేష్, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్, హెల్త్ కార్డుల పేరిట మోసం

రంగంపేట: రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కొందరు యువకులు మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బందిమని చెబుతూ ఈ-శ్రమ్, హెల్త్ కార్డుల పేరిట మోసానికి పాల్పడుతున్నారు. కుటుంబ సభ్యులందరూ హెల్త్ కార్డులు చేయించుకోవాలంటూ చెప్పి, ఆధార్, ఫోన్ నంబర్లు అడిగి ఈ-శ్రమ్ కార్డుకి రూ.50, హెల్త్ కార్డుకి రూ.50 చొప్పున ఒక్కొక్కరి నుంచి రూ.100 గుంజుతున్నారు. అలా ఇంటిలో ఎంత మంది ఉంటే అన్ని రూ.100లు కొట్టేస్తున్నారు. సచివాలయం నుంచి వచ్చారంటే నిజమేనని నమ్మి కొందరు డబ్బులు సమర్పించుకుంటున్నారు. దీనిపై సచివాలయ అధికారులను అడిగితే తమకేమి సంబంధంలేదని వారెవరో కూడా తమకు తెలియదని చెబుతున్నారు. ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, త్వరలోనే ఈ పరిధిలోకి వచ్చే వారందరికీ ప్రభుత్వమే పోర్టల్‌లో వారి వివరాలు నమోదుచేసి ఉచితంగా కార్డులు అందచేస్తుందంటున్నారు.

సాగుకు సన్నద్ధం కావాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మధురపూడి: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు అధ్యక్షతన రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుంచే విత్తుకోవాలన్నారు. ఆకుమడులు జూన్‌లోనే వేయడం వల్ల అక్టోబర్ చివరికి పంట కోతలకు వస్తుందని, దీంతో నవంబర్‌లో ఎదురయ్యే తుపానుల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతన్నలకు ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. 30న కోరుకొండలో జిల్లా స్థాయి మీటింగ్ ఏర్పాటుచేసి, రైతు భరోసా, ఇన్‌పుట్ రాయితీ విడుదల చేయనున్నట్టు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు తెలిపారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, మండలాధికారి గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేద్దాం

ఆరోగ్యశ్రీ సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఆరోగ్యశ్రీ సేవల అమలు తీరుపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అందజేసే వైద్య విధానం ద్వారా ప్రభుత్వ ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా ఆయా ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వైద్యాధికారులు మెరుగైన పనితీరు చూపాలన్నారు. కొందరు పనితీరు మెరుగుపరిచేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమని అన్నారు. అయినప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ వైద్యుల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు 50 శాతం మేర విస్తరించాల్సి ఉందన్నారు. గర్భిణులకు వైద్య సేవలు అందించే సామర్థ్యం పెంచాలన్నారు. సాధారణ డెలివరీలు చేపట్టాలని, వాటికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఇండెంట్ అందజేయాలని సూచించారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో గత నెల 22 గర్భిణి కేసులు ఉండగా, ఈ నెలలో 69 కేసులు, కొవ్వూరులో 58 నుంచి 100 వరకూ ప్రగతి చూపారన్నారు. ఇంకా పెంచాల్సి ఉందన్నారు. కడియం, మలకపల్లి, దొమ్మేరు, ఉండ్రాజవరం, అన్నదేవరపేట తదితర 13 ఆసుపత్రులలో ఒక్క డెలివరీ కేసు నమోదు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఆయా ఆసుపత్రులు నమోదుతో పాటు వైద్యాధికారులు కూడా వారి పేర్లు నమోదు పూర్తి చెయ్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నాటికి సంపూర్ణ నివేదిక అందజేయాలని, ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో నమోదు చేసే ప్రక్రియపై కోఆర్డినేటర్ సమగ్రంగా అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించే సామర్థ్యం మేరకు నాడు- నేడు ద్వారా మౌలిక సదుపాయాలు, మానవ వనరుల అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్య అధికారులు డాక్టర్ ఎస్.వసుంధర, ఆరోగ్యశ్రీ కోఆర్డి నేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె.సాయికుమార్, డాక్టర్ అభిషేక్, పీహెచ్‌సీ వైద్యులు, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న డివిజన్ ఇన్‌చార్జి ప్రసాద్, మజ్జి అప్పారావు తదితరులు

ప్రకాశంనగర్: వలంటీర్లు సంక్షేమ వారధులని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక 39వ డివిజన్‌లోని 66, 67 సచివాలయాల్లో డివిజన్ ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. దీనికి జేసీఎస్ ఇన్‌చార్జ్ మజ్జి అప్పారావు, ఆర్‌ఐ కామేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు మరింత శ్రద్ధగా పనిచేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం 33 మంది వలంటీర్లను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్‌లు ప్రేమ్‌కిశోర్, సతీష్, వెల్ఫేర్ సెక్రటరీ ప్రవీణ్, వీఆర్వోలు బాలాజీ, కరీమా, సచివాలయాల కన్వీనర్లు షేక్ మస్తాన్, నాగులపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ పింఛను కానుక' నిధుల విడుదల

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛను కానుకను జిల్లాలో లబ్ధిదారులకు జూన్ ఒకటిన పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64.56 కోట్ల నిధులు విడుదల చేసింది. శనివారం ఈ విషయాన్ని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు. జిల్లాలో 2,34,199 మంది పింఛనుదారులకు వలంటీర్ల ద్వారా ఈ సొమ్ము అందజేస్తారని అన్నారు.

ప్రతిభను వెలికితీస్తే మెరికలే..



క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే మెరికల్లా తయారవుతారని, దీనికి టోర్నమెంట్లు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం సీతానగరం డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, అందరూ స్నేహపూర్వక వాతావరణంలో సాగాలన్నారు. 2009 నుంచి నిర్విరామంగా లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన నామవరం పాథర్స్ టీమ్‌కు రూ.40 వేలు, రన్నర్‌గా నిలిచిన సీతానగరం టీమ్‌కు రూ.25 వేలతో పాటు ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మండల సర్పంచుల సమాఖ్య సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పీఏసీఎస్ చైర్ పర్సన్ మట్ట వసంతరావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, మట్ట శ్రీను, ఈవెంట్ మేనేజర్ మట్ట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మహాపుష్కర వనం ఆర్బోరేటమ్‌లో మొక్క నాటుతున్న సిబ్బంది

రాజానగరం: లాలాచెరువులోని గోదావరి మహాపుష్కర వనం, ఆర్బోరేటమ్‌లో ప్రాంతీయ అటవీ పరిశోధన విభాగం ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ శనివారం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం ఆవశ్యతను తెలియజేస్తూ వనంలో స్టేట్ సిల్వీకల్చరిస్టు అధికారి షేక్ సలాం పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం వాకర్స్‌చే మొక్కలను నాటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది ఆశారేఖ, మధు మోహన్, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొవ్వూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై మంజూరైన ట్రాక్టర్‌ను ధనకొండమ్మ తల్లి కస్టమ్ హైరింగ్ సెంటర్ సభ్యులకు అందజేశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఈ కార్యక్రమం జరిగింది. చాగల్లు మండలంలోని నందిగంపాడు గ్రామ రైతులకు రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్‌తో పాటు, మూడు కృషి ట్రాక్టర్లను మంజూరు చేశారు. వాటిని నలభై శాతం రాయితీ కింద రూ.6 లక్షల సబ్సిడీపై అందించారు. పలువురు నందిగంపాడు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భానుడు భగభగ



ఎండకు నిర్మానుష్యంగా మారిన ఎయిర్‌పోర్టు రోడ్డు

మధురపూడి: రోహిణీ కార్తెలో భానుడు సెగలు పుట్టించాడు.. వేడి గాలులతో నిప్పులు చెరిగాడు. శనివారం కోరుకొండలో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం రద్దీగా ఉండే ఎయిర్ పోర్టు రోడ్డు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారింది. బయటకు వచ్చేందుకు ఎవరూ సహసించలేదు.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక మల్లయ్యపేట ప్రాంతంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎం.అంజేష్ (21) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక్కడ సోఫాల తయారీ కంపెనీలో పనిచేస్తున్న అంజేష్ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువతిని ప్రేమించాడు. అయితే ఆమెకు పెళ్లి కుదిరినట్లు తెలిసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి



కందుకూరి దంపతుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న షర్మిలారెడ్డి



కందుకూరి దంపతుల సమాధులకు అంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు



టౌన్ హాల్ వద్ద కందుకూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

సీటీఆర్‌ఐ: గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి కొనియాడారు. స్థానిక వీటీ కళాశాల ఆవరణలోని ఆనంద గార్డెన్స్‌లో హితకారిణి సమాజం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని నిర్వహించారు. కందుకూరి దంపతుల సమాధుల వద్ద షర్మిలారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అడ్డుకున్న సాహసి కందుకూరి వీరేశలింగం పంతులు అని కీర్తించారు. సంస్కర్తగానే కాకుండా సాహితీవేత్తగా ప్రత్యేకతను చాటారని కొనియాడారు. ఆనంద్ గార్డెన్స్‌లో కందుకూరి దంపతుల సమాధుల వద్ద వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ నివాళులర్పించారు. స్త్రీ సాధికారత, వితంతువుల పునర్వివాహం, స్త్రీ విద్య కోసం పోరాడిన మహనీయుడు వీరేశలింగం పంతులు అని కొనియాడారు. హితకారిణి చైర్‌పర్సన్ కాశి మునికుమారి పాల్గొన్నారు. అలాగే టౌన్ హాల్ వద్ద కందుకూరి విగ్రహానికి ట్రస్టీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తన యావదాస్తిని సమాజ హితం కోసం ఖర్చు చేయడమే కాకుండా సమాజంలో మూఢ నమ్మకాలను తన రచనల ద్వారా రూపుమాపడానికి ప్రయత్నం చేశారన్నారు. అసదుల్ల అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. వీరేశలింగం దంపతుల విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ నవయుగ వైతాళికుడిగా పేరుగాంచిన విరేశలింగం పంతులు స్త్రీ విద్య కోసం ఉద్యమించి పాఠశాలలు, కళాశాలలను స్థాపించారన్నారు. ఆంధ్రదేశంలో బ్రహ్మ సమాజాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, డాక్టర్ ఎం.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.